# జూనియర్ ఏజెంట్ శ్రీకర్



మధుబాబు

# జూనియర్ ఏజెంట్ శ్రీకాంత్

*( షాడో స్పై థ్రిల్లర్ )*

---

రచన:

మధుబాబు

*© Author*
*© Madhu Baabu*
*This digital book is published by -*

*కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.*

*సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.*

*All rights reserved.*

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

## జూనియర్ ఏజెంట్ శ్రీకర్

సాయంత్రం ఐదు గంటలు కూడా కాకముందే లండన్ నగరాన్ని ఆవరించుకున్నది దట్టమైన పొగమంచు. చీకటి పడటానికి మరో రెండు గంటలు వ్యవధి వున్నా మసక చీకట్లు ముసురుకున్నట్లు కాంతి విహీనం అయిపోయింది వాతావరణం.

ఆ సమయంలో లావాటి సిగార్ ని వెలిగించుకుంటూ తన ఆఫీసు ముందు కారు దిగి లోపలికి పోయాడు బ్రిటన్ ఫారిన్ మినిస్టర్ లార్డ్ వెస్లీ.

ఐదు గంటలకు క్లోజ్ అయిపోతుంది అతని ఆఫీసు. తమ పనులన్నిటినీ పూర్తిచేసుకొని టైం ఎప్పుడు అవుతుందా అని ఎదురుచూస్తున్నారు అతని క్రింద పనిచేసే అసిస్టెంట్లు అందరూ.

వారిని చూసి తనలో తను నవ్వుకుంటూ ఎయిర్ కండిషన్డ్ గదిలోకి పోయి ఒక రివాల్వింగ్ చైర్లో కూర్చున్నాడు లార్డ్ వెస్లీ.

వెంటనే ఆ గదిలోకి వచ్చింది అతని సెక్రటరీ. ఆరోజు సాయంత్రం వచ్చిన లెటర్లను తెచ్చి అతని ముందు పెట్టింది.

ఒక్కొక్క లెటర్ ని చించి, జాగ్రత్తగా చదవటం మొదలు పెట్టాడతను. అరగంట తరువాత అతని ముందు మిగిలింది ఒకే ఒక సాదా కవర్. దాన్ని కూడా చించి లోపల వున్న తెల్లటి కాయితాన్ని బయటికి తీశాడతను.

బ్రిటీష్ ప్రభుత్వానికి ఒక హెచ్చరిక. వెంటనే పది మిలియన్ల పౌండ్లను నాకు చెల్లించండి. చెల్లించక పోతే వారం రోజులకు ఒకరు చొప్పున మీ రాజకీయ నాయకులందర్నీ చంపుతాను. నా హెచ్చరికను నవ్వులాటగా తీసి పారేయకండి...

హడావుడిగా వ్రాసినట్లు వంకర టింకర్లుగా వున్న ఆ అక్షరాల్ని చదివి పెద్దగా నవ్వాడు లార్డ్ వెస్లీ.

ప్రభుత్వాన్ని బెదిరించి డబ్బు సంపాదించాలని ప్రతి నేరస్తుడు కలలు కంటూనే వుంటాడు. బెదిరించటం చాలా తేలిక... బెదిరింపును ఆచరణలో పెట్టటం అసంభవం.

గతంలో ఎన్నో రకాల బెదిరింపు లెటర్లను చూసి వున్నాడతను. ఆరోజు వచ్చిందికూడా అటువంటిదే అనుకుంటూ దాన్ని చించి వుండచుట్టి చెత్తబుట్టలో పడేశాడు.

రెండు నిముషాల తరువాత బార్లా తెరిచి వున్న ఒక ఫ్రెంచి విండోలో నుంచి కందిరీగలా ఝుంకారం చేస్తూ దూసుకు వచ్చింది సూపర్ షాట్ రైఫిల్ నుంచి వెలువడిన బుల్లెట్ ఒకటి.

కుర్చీ వెనక్కి వాలి, సగం కాలి ఆరిపోయిన సిగార్‌ని వెలిగించబోతున్నాడు లార్డ్ వెస్లీ. అతని చేతిలోని లైటర్ అతనికి తెలియకుండానే జారి క్రిందపడిపోయింది. బుల్లెట్ దెబ్బకు అతని తల గుర్తు పట్టటానికి వీలు లేనంతగా నాశనం అయిపోయింది.

పది నిముషాల తరువాత ఆ గదిలోకి వచ్చింది అతని సెక్రటరీ. రక్తపు మడుగులో తేలుతున్న లార్డ్ వెస్లీ ని చూసి కెవ్వున అరిచి, అలాగే విరుచుకు పడిపోయింది.

రాత్రి పన్నెండు గంటల సమయంలో డిప్పీ హార్బర్ వెనుక వున్న సెయిలర్స్ కాలనీని సమీపించి, ఒక రేకుల షెడ్ చాటున నిలబడ్డాడు సి.ఐ.బి జూనియర్ ఏజెంట్ శ్రీకర్.

కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని కటిక చీకటితో నిండివుంది ఆ ప్రదేశం అంతా. రేకుల షెడ్ కి వంద గజాల దూరంలో ఒక థర్డ్ క్లాస్ బార్ కమ్ రెస్టారెంట్ కనిపిస్తోంది. పీకల దాకా తాగిన ఓడ కళాసీలు, ఒకరి తరువాత ఒకరుగా అందులోంచి బయటికి వస్తున్నారు.

వారికి కనిపించకుండా రేకుల షెడ్ గోడలకు ఆనుకొని ఒదిగి నిలబడ్డాడు శ్రీకర్. డిప్పీ హార్బర్ రౌడీయిజానికి పెట్టింది పేరు. పరాయివాళ్ళు ఎవరైనా తమ లొకాలిటీలోకి వస్తే వూరుకోరు ఆ కళాసీలందరూ.

అనీజీగా అటూయిటూ కదిలి, ఫాంటు జేబులో వున్న రివాల్వర్ ని తడుముకున్నాడు శ్రీకర్. సాధ్యమైనంత వరకూ ఎటువంటి గొడవా లేకుండా పని పూర్తి చేసుకు రమ్మని అతనికి

ఆర్డర్లు యివ్వబడ్డాయి. తాగి తందనాలాడుతున్న సెయిలర్స్ ని చూస్తుంటే అది అంత తేలిక కాదేమో అనిపించ సాగిందతనికి.

బరువుగా కదలటం ప్రారంభించింది టైం. రెండు గంటలు అవుతుండగా బార్ కమ్ రెస్టారెంట్ తలుపులు మూతలు పడ్డాయి. దాని ముందు నిలబడి ఏదో విషయాన్ని గురించి తీవ్రంగా వాదించుకుంటున్న ఆఖరి గుంపు తడబడుతున్న అడుగులతో అవతలికి వెళ్ళిపోయింది.

తేలికగా నిట్టూర్చి షెడ్ ప్రక్క నుంచి బయటికి వచ్చాడు శ్రీకర్. పాంటు జేబుల్లో చేతులు పెట్టుకొని వడి వడిగా అడుగులు వేస్తూ, బార్ కి వంద గజాల అవతలగా వున్న పెద్ద పాడుబడిన భవనాన్ని సమీపించాడు.

అదే సమయంలో కిర్రుమని శబ్దం చేస్తూ తెరుచుకుంది ఆ భవనం ముందున్న కిటికీ ఒకటి.

"మిస్టర్ శ్రీకర్..." రహస్యంగా పిలిచింది కిటికీ వెనుక వున్న ఒక కంఠం.

శ్రీకర్ గుండెల మీద నుంచి మరికొంత బరువు దిగిపోయినట్లు అయింది. తనను ఎవరూ గమనించటంలేదని నిశ్చయపరుచుకొని గబగబా ఆ భవనంలోకి పోయాడు.

చెత్తా చెదారంతో అసహ్యం కలిగించేలా వుంది ఆ భవనపు లోపలి భాగం. సగం విరిగిపోయిన ఒక గది మధ్య నిలబడి అతని కోసమే ఎదురు చూస్తున్నాడు... సన్నగా పొడుగ్గా అస్థిపంజరం మాదిరిగా వున్న ఒక వ్యక్తి.

"శ్రీకర్ అంటే నేనే మిస్టర్... నువ్వు చెప్తానన్న ఇన్ఫర్మేషన్ ఏమిటో వెంటనే చెప్పు..." అతని ముందు నిలబడి, కను చివరలనుంచి చుట్టూ చూస్తూ అడిగాడు శ్రీకర్.

గారపట్టిన కొక్కిరి పళ్ళు బయటికి కనిపించేలా నవ్వాడు ఆ వ్యక్తి.

“అంత తొందర పనికిరాదు బ్రదర్... ముందు నాకు ఐదు వేల పౌండ్లు కావాలి. ఆ డబ్బు నా ముందు పెట్టు... నీ ప్రశ్నలకు సమాధానం నేను బయట పెడతాను” అన్నాడతను ఒక బాటిల్ లో వున్న నాటు సారాను గొంతులోకి ఒంపుకుంటూ.

ఫాంటు జేబులో వున్న రివాల్వర్ ని తడుముకుంటూ ఆలోచనలో పడ్డాడు శ్రీకర్.

అంతకు వారం రోజుల ముందు లండన్ నగరంలో హత్య చేయబడ్డాడు ఫారిన్ మినిస్టర్ లార్డ్ వెస్లీ. హత్య జరిగిన మూడో రోజున ఫారిన్ డిపార్ట్ మెంట్ కి ఫ్రాన్స్ లో వున్న డిప్పీ పట్టణం నుంచి ఒక మెస్సేజి వచ్చింది. లార్డ్ వెస్లీని హత్య చేసిన వ్యక్తి ఎవరో తనకు తెలుసుననీ, ఎవరినైనా డిప్పీ హార్బర్ దగ్గరికి పంపితే ఆ యిన్ఫర్మేషన్ అందిస్తానని తెలియజేశాడు ఒక స్మగ్లర్.

లార్డ్ వెస్లీ హంతకుడని పట్టుకోవటానికి లండన్ పోలీస్ బలగాలన్నీ తీవ్రంగా పరిశోధనలు చేస్తున్నాయి. ఆ సమయంలో ప్రత్యేకమైన శిక్షణ పొందటానికి స్కాట్ లాండ్ యార్డ్ కి

వచ్చివున్నాడు శ్రీకర్. అతని శిక్షణలో ఒక భాగంగా అతన్ని డిప్పీ పట్టణానికి పంపారు స్కాట్ లాండ్ యార్డ్ అధినేతలు, స్మగ్లర్ ని కలుసుకొని అతని వద్ద వున్న యిన్ఫర్మేషన్ ని తెలుసుకోమని ఆర్డర్స్ యిచ్చారు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్ బ్రదర్? డబ్బును చూస్తేగాని నా నోటికి వున్న తాళం విడివడదు..." చిన్నగా నవ్వుతూ మరోసారి హెచ్చరించాడు స్మగ్లర్.

"ఆల్ రైట్... రేపు ఉదయం డబ్బుతో యిక్కడికి వస్తాను. నువ్వు చెప్పదలుచుకున్నదేదో వెంటనే చెప్పటానికి సిద్దంగా వుండు..." అంటూ వెనుతిరిగాడు శ్రీకర్.

తల అడ్డం తిప్పుతూ అతని భుజం మీద చేయివేశాడు స్మగ్లర్.

"పొద్దుటపూట వస్తే ప్రాణాలతో యీ లొకాలిటీని వదిలి బయటికి పోలేవు బ్రదర్... రాత్రిపూట యిదే టైంకి రా... ఇంకో విషయం బాగా గుర్తుపెట్టుకో... నువ్వు వచ్చే లోపల నాకేదైనా

ప్రమాదం ఏర్పడితే, వెంటనే గ్రేసీ పట్టణానికి పోయి వైట్ రోజ్ బార్ లో కూర్చో... నా మనుష్యులు నిన్ను కలుసుకుంటారు. నాకు యివ్వాల్సిన డబ్బును వాళ్ళకి యిస్తే నీకు కావాల్సిన యిన్ఫర్మేషన్ వాళ్ళు చెప్తారు" అంటూ గిరుక్కున వెనుతిరిగి మరో పాడుబడిన గదిలోకి వెళ్ళిపోయాడతను.

ఎన్నో అనుమానాలు శ్రీకర్ మనసులో అడుగుపెట్టాయి. వాటిని గురించి ఆలోచిస్తూ పాడుబడిన భవనంలో నుంచి బయటికి వచ్చి, సెయిల్స్ లొకాలిటీ చివరి భాగంవైపు అడుగులు వేశాడు.

ఒక యింటిముందు నిలబడి తమలో తాము యింకా వాదించుకుంటూనే వున్నారు అంతకు ముందు అతనికి కనిపించిన కళాసీలు.

"హేయ్! ఎవరు నువ్వు?" శ్రీకర్ ని చూడగానే చటుక్కున రోడ్ కు అడ్డం నిలబడుతూ అరిచాడు వారిలో ఒకతను.

"నీ బావమరిదినిబే... కళ్లు కనిపించటంలేదూ?" కోపంగా అడిగాడు శ్రీకర్.

“నాబావమరిదివా? ఇంగ్లాండ్ నుంచి ఎప్పుడు తిరిగి వచ్చావ్?” అనుమానంగా అడుగుతూ కనులు నులుముకొని చూశాడు ఆ కళాసీ.

లాగిపెట్టి అతని ముఖం మీద గుద్దాడు శ్రీకర్. చేతికి దగ్గర్లో వున్న యింకో కళాసీని బలంగా అవతలికి నెట్టి ఒక్కసారిగా పరుగు అందుకున్నాడు.

“పట్టుకోండి...ఆ రాస్కెల్ ని పట్టుకోండి... వాడు నా బావమరిది కాదు...ముఖాన్ని రెండు చేతులతో అదుముకుంటూ బిగ్గరగా అరిచాడు మొదటి దెబ్బ తిన్న కళాసీ.

గొంతులు చిరిగిపోయేలా అరుస్తూ శ్రీకర్ ని వెంబడించారు అతని సహచరులు. వారికి అందే వుద్దేశ్యం శ్రీకర్ కి లేదు. వింటి నుంచి వెలువడిన బాణంలా పోయి ఒక యిరుకు సందులో జొరబడ్డాడు. దగ్గర దగ్గర గా కట్టబడివున్న రేకుల షెడ్ల మధ్యలో నుంచి అవతలికి పోయి హార్బర్ లొకాలిటీని అధిగమించాడు.

కళాసీల అరుపులకు లొకాలిటీ అంతా నిద్రలేచింది. కర్రల్ని కత్తుల్ని పట్టుకొని సందులన్నిటినీ వెతకటం మొదలు పెట్టారు అందరూ కలిసి.

ఆ సరికి డిప్పీ పట్టణం మధ్యభాగంలోకి వెళ్ళిపోయాడు శ్రీకర్. డిప్పీ సెంట్రల్ స్టేషన్ ముందున్న టెలిగ్రాఫ్ ఆఫీసుకు పోయి పారిస్ పట్టణంలో వున్న బ్రిటీష్ ఎంబసీకి ఒక అర్జెంట్ టెలిగ్రాం కొట్టాడు.

రెండు గంటల తరువాత అతన్ని చేరుకుంది ఆ టెలిగ్రాంకి జవాబు.

“రేపు ఉదయం పదిగంటలకల్లా డబ్బు నీ హోటల్ కి పంపబడుతుంది. ప్రొసీడ్ విత్ యువర్ ప్లాన్స్”

ఈ టెలిగ్రాం కాయితాన్ని చించి ఒక డ్రైనేజీ కాలువలోకి విసిరేస్తూ, అక్కడికి సమీపంలో వున్న తన హోటల్ కి వెళ్ళాడు శ్రీకర్.

హోటల్ సిబ్బంది అందరూ గాఢ నిద్రలో వున్నారు. అతని రాకను గురించి అక్కడ పట్టించుకొనేవారు ఎవరూలేరు.

నిశ్శబ్దంగా మెట్లు ఎక్కి మొదటి అంతస్థులో వున్న తన గదిని చేరుకున్నాడు శ్రీకర్. దుస్తుల్ని మార్చుకోనుకూడా మార్చుకోకుండా అలాగే బెడ్ మీద పడుకొని గాఢ నిద్దురలో మునిగి పోయాడు.

## 3

నిన్న రాత్రి వచ్చిన దొంగ రాస్కెల్ యివ్వాళ గనుక వస్తే నాచేతిలో చచ్చిపోయాడన్నమాటే ! నరికి పోగులు పెట్టేస్తాను..." అన్నాడు పెడ్రో.

"రాడు బ్రదర్... వాడికంత ధైర్యంలేదు. నీవంటి వీరుడి ముందు నిలబడటం వాడికి చేతకాదు..." తడుముకోకుండా సమాధానం యిచ్చాడు శ్రీకర్.

పెడ్రో ముఖం పెట్రోమాక్స్ లైటులా వెలిగింది ఆమాటల్ని వినగానే.

"నీ మాటలు నాకు నచ్చాయిలే... నీ పేరేమిటి?" అంటూ కనులు చిట్లించుకొని అతని ముఖంలోకి చూశాడు.

నవ్వుతూ తలదించుకొని తన చేతిలో వున్న సారా బాటిల్ ని అతనికి అందించాడు శ్రీకర్.

అతని పేరును తెలుసుకొనే మాట మరిచిపోయి సారా తాగటంలో మునిగిపోయాడు పెడ్రో. సెయిలర్స్ లొకాలిటి చివర కాపలా నిలబడి వున్నాడతను. అతన్ని దాటి పాడుబడిన భవనం ముందుకు పోవాలంటే బాటిల్ ని ఆశ్రయించక తప్పదని గ్రహించి, ఒక బాటిల్ ని కొనుక్కొచ్చాడు శ్రీకర్.

పావుగంట కూడా గడవకముందే మూడొంతులు బాటిల్ ని ఖాళీచేశాడు పెడ్రో. మత్తుతో మూసుకుపోతున్న కనులను బలవంతంగా తెరిచి వుంచటానికి ప్రయత్నం చేస్తూ చుట్టూ చూశాడు.

అదును చూసుకొని అతని నెత్తిమీద బలంగా గుద్దాడు శ్రీకర్.

“మై...మైగాడ్...ఏ...ఏమిటిది?” ఆశ్చర్యంగా అడిగాడు పెడ్రో.

“ఎ...ఎసాల్ట్...బ్రదర్...రౌ...రౌడీయిజం,...” అంటూ లాగిపెట్టి యింకో దెబ్బ వేశాడు శ్రీకర్.

పెడ్రో కనులముందు యింద్ర ధనస్సులు ప్రత్యక్షం అయినాయి. బాధగా మూలిగి అలాగే ముందుకు వాలిపోయాడు.

వెంటనే లేచి నిలబడ్డాడు శ్రీకర్. ఆరోజు ఉదయం పారిస్ నుంచి డబ్బు పంపించారు ఎంబసీ అధికార్లు. ఆడబ్బును ఒక కాన్వాస్ బాగ్ లో భద్రపరిచి వుంచాడతను. ఆబాగ్ ని భుజానికి తగిలించుకొని, స్పృహలేని పెడ్రోను బలవంతంగా లేపి పాడుబడిన భవనంవైపు అడుగులు వేయించాడు.

బార్ ముందు నిలబడి వున్న కళాసీలు కొందరు అతన్ని గమనించారు. స్పృహలేని పెడ్రోని చూసేసరికి వారి ముఖాలమీద చిరునవ్వులు ప్రత్యక్షం అయినాయి.

“దొంగనాయాల్ని రోడ్ మీద వదిలెయ్... ఇంటికి తీసుకుపోయావంటే వాడిని నిన్ను యిద్దర్నీ కలిపి కూర వండుకుంటుంది వాడి పెళ్ళాం...” అంటూ సలహా యిచ్చాడు వారిలో ఒకతను.

వారెవరికీ తన ముఖం కనిపించకుండా జాగ్రత్త పడుతూ పాడుబడిన భవనం చాటుకు పోయాడు శ్రీకర్. పెడ్రోని ఒక గోడకు ఆనించి కూర్చోబెట్టి, ఎదురుగా కనిపించిన కిటికీ మీద అరచేత్తో చరిచాడు.

వెంటనే తెరుచుకుంది ఆ కిటికీ.

"ఎవరది?" రహస్యంగా అడిగింది ఆ కంఠం.

"నేను శ్రీకర్ ని... డబ్బు తెచ్చాను" మరింత రహస్యంగా సమాధానం యిచ్చాడు శ్రీకర్.

"అలాగా! అయితే లోపలికి రా..."అంటూ కిటికీ ని బార్లా తెరిచాడు కిటికీ వెనుక నిలబడి వున్న వ్యక్తి.

ఊచలు లేని ఆకిటికీలో నుంచి భవనం లోకి దూకాడు శ్రీకర్. దూకిన మరుక్షణం అతని మెడకు ఆనుకుంది ఒక కత్తి.

“అరిచి అల్లరి చేయటానికి ప్రయత్నించకు బ్రదర్... నోరు తెరిచావంటే నీ పీక తెగి నేలమీద పడుతుంది” ఇనుప గొలుసులు రాచుకున్నట్లు కరకరలాడుతూ హెచ్చరించింది మరో కంఠం.

ఆశ్చర్యంతో మ్రాన్పడిపోయాడు శ్రీకర్. ఆగదిలో అతనికి ఆరుగులు నూతన వ్యక్తులు కనిపించారు. అందరి చేతుల్లోను తళతళ మెరుస్తున్న కత్తులు కనిపించాయి.

“ఏమిటిది? నిన్న నాతో మాట్లాడిన మనిషి ఏడి?” ఆశ్చర్యాన్ని అతి ప్రయత్నంమీద అణుచుకుంటూ అడిగాడు.

చిన్నగా నవ్వి ఒక మూలన వున్న గోనె సంచీని గది మధ్యకు దొర్లించాడు ఒక వ్యక్తి. అగ్గిపుల్లను వెలిగించి ఆ గోనే సంచీ మీద పట్టుకున్నాడు యింకో వ్యక్తి.

రక్తం కారుతున్న తలతో నిర్జీవంగా చూస్తూ శ్రీకర్ కి కనిపించాడు అంతకుముందు రోజు అతనితో మాట్లాడిన స్మగ్లర్. అతని ప్రాణాలు అనంత విశ్వంలో కలిసిపోయాయని వెంటనే గ్రహించాడు శ్రీకర్.

“పది సంవత్సరాలనుంచీ కలిసి పనిచేశాం మిస్టర్...దొరికిన డబ్బును సమానంగా పంచుకున్నాం... ఇప్పుడు మమ్మల్ని మోసం చేసి నువ్వు తెచ్చే డబ్బుతో పరాయి దేశం పారిపోవాలని ప్లాను వేశాడు ఈ దుర్మార్గుడు. అందుకు తగిన శిక్షను అనుభవించాడు. నువ్వు తీసుకొచ్చిన డబ్బును యిలా యిచ్చెయ్...” అంటూ రెండు అడుగులు ముందుకు వేసి చేయి చాచాడు ఒక దృఢకాయుడు.

అప్రయత్నంగా వెనక్కి జరిగి డబ్బు సంచీని వెనక్కి లాక్కున్నాడు శ్రీకర్.

“మీ పర్సనల్ తగాదాలతో నాకు నిమిత్తం లేదు. నాకు కావాల్సిన యిన్ఫర్మేషన్ యివ్వండి. డబ్బును మీరు తీసుకోండి”అన్నాడు.

“ఏమిటా యిన్ఫర్మషన్?” ఆశ్చర్యంగా అడిగాడా దృఢకాయుడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=236**